## నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

**బోడుప్పల్:** విద్యుత్ మరమ్మతుల కారణంగా మంగళవారం పలు కాలనీల్లో విద్యుత్ సరఫరాను నిలిపేస్తున్నట్లు ఏఈ వేణుగోపాల్ ఓ ప్రకటనలో తెలిపారు. మారుతీనగర్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

## ఎమ్మెల్యేపై దాడికి యత్నించిన వారిపై చర్యలు తీసుకోవాలి

**గౌతంనగర్:** మాణికేశ్వరినగర్‌లో బోనాల కార్యక్రమానికి వెళ్తున్న కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్‌పై దాడికి యత్నించిన వారిని కఠినంగా శిక్షించాలని గౌతంనగర్ డివిజన్‌కి చెందిన కాంగ్రెస్ నేతలు అన్నారు. సోమవారం ఆయన నివాసంలో కలిసి పరామర్శించారు. నాగరాజు, బాలరాజుయాదవ్, రాములు, కొమురయ్య, శ్రీనుయాదవ్, బాలరాజు, దేవేందర్ తదితరులున్నారు.

## అరుణాచలానికి ప్రత్యేక బస్సు


కవిత, చెంగిచెర్ల డిపో మేనేజర్

**బోడుప్పల్:** అరుణాచల క్షేత్రానికి వెళ్లే భక్తులకు చెంగిచర్ల డిపో నుంచి ప్రత్యేక బస్సు సౌకర్యం కల్పించినట్లు డిపో మేనేజర్ కవిత వెల్లడించారు. చెంగిచర్లలో సోమవారం ఆమె మాట్లాడుతూ.. ఈనెల 25న సాయంత్రం ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సును ఏర్పాటు చేశామన్నారు. చెంగిచర్ల నుంచి ఉప్పల్ బస్టాండ్, నాగోల్ చౌరస్తా, ఎల్బీనగర్, ఆరాంఘర్ మీదుగా కానిపాకం విఘ్నేశ్వరస్వామి దర్శనం, అక్కడ నుంచి గోల్డెన్ టెంపుల్ అమ్మవారి దర్శనం, అరుణాచల శివదర్శనం ఉంటుందన్నారు. పెద్దలకు రూ.3900, పిల్లలకు రూ.3300లు చార్జీ ఉంటుందని వివరించారు. 35 మంది గ్రూపుగా ఉంటే ఇంటి వద్దకే బస్సును పంపిస్తామన్నారు. వివరాలకు 7893088433, 9063413318.

## అభివృద్ధి పనులకు శంకుస్థాపన



**బోడుప్పల్:** ప్రివిలేజ్ ఎస్టేట్స్ కాలనీలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు సోమవారం 1వ డివిజన్ ఇన్‌చార్జి కుర్రి శివశంకర్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాలనీ ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఈ పనులను ప్రారంభించినట్లు వెల్లడించారు. కాలనీ అధ్యక్షుడు జయేందర్‌రెడ్డి, ఉపాధ్యక్షులు రాజయ్య, కాలనీవాసులు వేణుగోపాల్, రాకేష్, గోపాల్‌రెడ్డి, శ్రీనివాస్, సోమేష్, రామకృష్ణారెడ్డి, శివ, ఉపేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

## పాటల సీడీ ఆవిష్కరణ


సీడీని ఆవిష్కరిస్తున్న కేటీఆర్ తదితరులు

**మల్లాపూర్:** 24న బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పుట్టిన రోజు సందర్భంగా మల్లాపూర్ డివిజన్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి రూపొందించిన పాటల సీడీని సోమవారం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డితో కలిసి కేటీఆర్ చేతుల మీదుగా సీడీని విడుదల చేశారు. మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, రావుల చంద్రశేఖర్, గాయకుడు వేర్పుల మహేష్, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## అభిమానుల కోసం ఆగిన 'బండి'

**చంచల్‌గూడ:** ఆదివారం బోనాల సందర్భంగా కేంద్ర మంత్రి బండి సంజయ్ పాతబస్తీలో పర్యటిస్తున్నట్లు తెలుసుకున్న ఆయన అభిమానులు కలిసేందుకు దారి పక్కన వేచి చూస్తున్నారు. కాన్వాయ్‌లో వెళ్తున్న కేంద్ర మంత్రి దూరం నుంచి మహిళలను చూసి కాన్వాయ్ ఆపగా మహిళల ఆయనకు బొట్టు పెట్టి శాలువాతో సత్కరించారు. అభిమానులను, కార్యకర్తలతో బండి స్పందించిన తీరుపై సోషల్ మీడియాలో ప్రశంసలు వస్తున్నాయి.

## అర్హులందరికీ రేషన్ కార్డులు ఇవ్వాలి

**హస్తినాపురం:** అర్హులైన పేదప్రజలందరికీ రేషన్ కార్డులు ఇవ్వాలని హస్తినాపురం డివిజన్ బీజేపీ పార్టీ అధ్యక్షుడు ఎరుకల మల్లేష్‌గౌడ్ అన్నారు. సోమవారం హస్తినాపురం డివిజన్ పరిధిలోని నందనవనం బస్తీలో ఇంటింటికి తిరిగి రేషన్ కార్డు లేని కుటుంబాలను గుర్తించి వారికి మీసేవ కేంద్రాల్లో దరఖాస్తు చేయించారు. ఈ సందర్భంగా మల్లేష్‌గౌడ్ మాట్లాడుతూ.. నందనవనం బస్తీలో వందలాది కుటుంబాలు రేషన్‌కార్డు లేక ప్రభుత్వ పథకాలు పొందలేకపోతున్నారని వారికి రేషన్ కార్డులు ఇప్పించేందుకు తాము కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రాజుగౌడ్, వెంకటేశ్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, చంద్రకాంత్, సత్యనారాయణ యాదవ్, బాలరాజు, బాలకృష్ణ పాల్గొన్నారు.

# అంధకారంతో అవస్థలు!


వీధుల్లో అలుముకున్న అంధకారం (ఫైల్)

- బస్తీలు, కాలనీల్లో వెలగని వీధిదీపాలు
- నిర్వాహకులపై అధికారుల పర్యవేక్షణ కరువు
- చీకట్లో ప్రమాదాలకు గురౌతున్న ప్రజలు

**రామంతాపూర్ :** జీహెచ్ఎంసీ ఉప్పల్ సర్కిల్ పరిధిలోని రామంతాపూర్, హబ్సిగూడ డివిజన్లలో వీధిదీపాల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. ముఖ్యంగా రామంతాపూర్‌లోని నేతాజీనగర్, నెహ్రూనగర్, ఇందిరానగర్, ఓల్డ్ రామంతాపూర్, బాలకృష్ణనగర్‌తో పాటు హబ్సిగూడ డివిజన్ పరిధిలోని గోకుల్‌నగర్ పీఎస్ కాలనీ, గణేష్‌నగర్, వెంకట్‌రెడ్డినగర్, రాంరెడ్డినగర్‌లోని బస్తీలు కాలనీలోని వీధిదీపాలు సరైన సమయపాలన లేకుండా వెలుగుతుండటం వల్ల ఆయా కాలనీలు, బస్తీల ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

### సరైన నిర్వహణ లేదు..

గతంలో సాయంత్రం 6.30 గంటలకు వీధి దీపాలు వెలిగి, ఉదయం 6.30కు ఆఫ్ చేసేవారు. ప్రస్తుతం వీధి దీపాల నిర్వహణ సరిగ్గా లేకపోవడం వల్ల రాత్రి 8.30 గంటలకు వెలుగుతూ ఉదయం 8.30కు స్విచ్ ఆఫ్ చేస్తున్నారు. సరైన సమయపాలన లేకుండా రాత్రి 9.00 గంటల వరకు వీధిదీపాలు వెలగకపోవడంతో కాలనీల్లో అంధకారం అలుముకుంటోంది. దీంతో స్థానికులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. పనుల నిమిత్తం బయటి నుంచి ఇంటికి వచ్చేవారు. ఈ అంధకారంలో గుంతల్లో గాయాలపాలవుతున్న ఘటనలు అనేకం చోటు చేసుకున్నాయి. జీహెచ్ఎంసీ నియమించిన కాంట్రాక్టర్లు కొన్ని బస్తీల్లో కాలనీలో వీధిదీపాలు టైమర్ల సాయంతో ఆటోమేటిక్‌గా వెలగడం, ఆటోమెటిక్ ఆఫ్ అయ్యేలా సమయాన్ని సెట్ చేశారు. కానీ ప్రస్తుతం టైమర్లు పనిచేయకపోవడంతో ఈ పరిస్థితి స్థానికులు వాపోతున్నారు.

### స్తంభాలు వేశారు... దీపాలు మరిచారు...

రామంతాపూర్ డివిజన్ పరిధిలో ఉన్న రాజేంద్రనగర్ హిందూ శ్మశానవాటికలో గత 2 నెలల క్రితం దాదాపు 10 విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేశారు. కానీ వాటికి ఇంత వరకు విద్యుత్ దీపాలు అమర్చకపోవడం, సాయంత్రం వేళలో అంత్యక్రియల కార్యక్రమాలు అంధకారంలోనే నిర్వహించడంతో ఇబ్బందులు ఎదురౌతున్నాయి. సరైన సమయపాలన లేకుండా రాత్రి 9 గంటల వరకు వీధిదీపాలు వెలగకపోవడంతో పలుబస్తీలు, కాలనీల్లో అంధకారం అలుముకుంటోంది. పర్యవేక్షణ లోపం..

వీధిదీపాల నిర్వహణ కోసం జీహెచ్ఎంసీ లక్షలాది రూపాయలు వెచ్చిస్తున్నా.. సరైన పర్యవేక్షణ లేకపోవడంతో ఈ సమస్య ఏర్పడినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

### ప్రజాప్రతినిధులు పట్టించుకోవాలి

రామంతాపూర్, హబ్సిగూడ డివిజన్లలోని బస్తీలు, కాలనీలో వీధిదీపాల నిర్వహణ అస్తవ్యస్తంగా మారడంతో ప్రజలు అంధకారంలో మగ్గుతున్నారు. ప్రజాప్రతినిధులు చొరవ తీసుకుని అధికారులపై ఒత్తిడి తెచ్చి వీధి దీపాలు సక్రమంగా సమయపాలన పాటిస్తూ వెలిగేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

### ప్రజలు ఇబ్బంది పడుతున్నారు



వర్షాకాలం కావడంతో సాయంత్రం 6 కాగానే చీకటి పడటం వల్ల వీధుల్లో అంధకారం అలుముకుంటోంది. గతంలోనూ సాయంత్రం 6.30కి వెలిగే వీధిదీపాలు రాత్రి 9 గంటలైనా వెలగకపోవడంతో వృద్ధులు పనిమీద బయటికి రావడానికి భయకంపితులవుతున్నారు. కొన్ని చోట్ల కుక్కలు వెంబడిస్తున్నాయి. కొంతమంది వృద్ధులు చీకట్లో బయటికి వచ్చి గాయాలపాలైన ఘటనలు ఉన్నాయి. సరైన సమయంలో వీధి దీపాలు వెలిగేలా ప్రజాప్రతినిధులు, అధికారులు తగిన చర్యలు తీసుకోవాలి. – కపర్తీశ్వర్‌రావు, రామంతాపూర్

### ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు



ప్రతిరోజు రాత్రి 9 గంటలైనా వీధిదీపాలు వెలగకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. రామంతాపూర్‌కు పక్కనే ఉన్న ఉప్పల్ పారిశ్రామికవాడలోని ఫ్యాక్టరీల్లో రెండో షిఫ్ట్ విధులు ముగించుకుని రాత్రి ఇంటికి చేరే పలువురు కార్యక్రమం దీపాలు వెలగకపోవడంతో చీకట్లో పడి గాయాలపాలవుతున్న ఘటనలు అనేకం ఉన్నాయి. దీనిపై అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. – చాంద్‌పాషా, నేతాజీనగర్ సంక్షేమ సంఘం ప్రతినిధి

### సమస్యలు పరిష్కరిస్తాం

వీధి దీపాల నిర్వహణకు ఏర్పాటు చేసిన ఆటోమెటిక్ టైమర్లలోని లోపాలతోనే ఈ సమస్య ఏర్పడింది. రెండు డివిజన్లలో క్షేత్రస్థాయిలో పలు బస్తీలు, కాలనీలోని వీధిదీపాలను పరిశీలించి వెలగని వాటిని తొలగించి కొత్తవాటిని అమర్చుతాం. అవసరమైన చోట మరమ్మతులు చేపట్టి సమస్యలు పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకుంటాం. – రవీందర్‌రెడ్డి, జీహెచ్ఎంసీ వీధిదీపాల డిప్యూటీ ఇంజినీర్

## వర్షాలతో ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు

సీఎం వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మనుచౌదరి



కలెక్టర్ మను చౌదరి, డిప్యూటీ కలెక్టర్లు రాధికాగుప్తా, విజయేందర్‌రెడ్డి తదితరులు

**సాక్షి,మేడ్చల్ జిల్లా:** వర్షాల నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా సంబంధిత అధికారులు అప్రమత్తంగా ఉండేలా ఆదేశాలు ఇచ్చినట్లు మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరి తెలిపారు. రెవెన్యూ యంత్రాంగంతో సహా పురపాలక సంఘాల్లో కమిషనర్లు, సంబంధిత ఉద్యోగులు అప్రమత్తంగా ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించినట్లు పేర్కొన్నారు. సోమవారం తెలంగాణ సచివాలయం నుంచి సీఎం రేవంత్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించగా.. మేడ్చల్ కలెక్టరేట్ నుంచి ఆయన మాట్లాడారు. చెరువులు, కుంటల సమీపంలో ఉన్న లోతట్టు ప్రాంతాలు, కాలనీలు వర్షం కారణంగా వరద ముంపునకు గురికాకుండా అన్ని విధాల చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ తెలిపారు.

### నగరంలో 150 బృందాలు : సీఎం రేవంత్‌రెడ్డి

వర్షాలు కురుస్తున్న వేళ జిల్లా కలెక్టర్లు అప్రమత్తతో అన్ని విభాగాల అధికారులను సన్నద్ధం చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి ఈ సందర్భంగా ఆదేశించారు. గత 3 రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయని, ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూడాలన్నారు. నగరంలో 150 బృందాలను ఏర్పాటు చేశామన్నారు.

### సమన్వయంతో పనిచేయాలి

హైదరాబాద్ నగరంలో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా సమన్వయంతో పనిచేయాలని సీఎం సూచించారు. పిడుగుపాటుతో జరిగే నష్టాల వివరాలు నమోదు చేయాలన్నారు. పీహెచ్‌సీ సెంటర్లు, ప్రభుత్వాసుపత్రుల్లో వైద్యులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. పశువులకు సంబంధించి వెటర్నరీ విభాగం అప్రమత్తంగా ఉండేలా చూడాలన్నారు.

### ఆకస్మిక తనిఖీలు చేపట్టాలి..

కలెక్టర్లు ఆకస్మిక తనిఖీలతో ఖచ్చితంగా క్షేత్రస్థాయిలో పర్యటనకు వెళ్లాలని సీఎం ఆదేశాలు జారీ చేశారు. అజాగ్రత్తగా ఉంటే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. ప్రతి రోజు కలెక్టర్లు తమ కార్యాచరణకు సంబంధించిన పూర్తి రిపోర్టును అందించాలని సీఎస్‌ను ఆదేశించారు.

### రైతులకు ఆందోళన అవసరం లేదు

రైతులకు కావాల్సినంత యూరియా ఉందని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. వ్యాపార అవసరాలకు యూరియా ఉపయోగిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎరువులకు సంబంధించి ఫిర్యాదులకు ప్రత్యేక డెస్క్ ఏర్పాటు చేయాలని సూచించారు.

ఈనెల 25 నుంచి వచ్చే నెల 10 వరకు అన్ని మండల కేంద్రాల్లో అధికారికంగా రేషన్ కార్డుల పంపిణీ చేపట్టాలన్నారు. శాసనసభ్యులు, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రులు రేషన్‌కార్డుల పంపిణీలో తప్పనిసరిగా పాల్గొనాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్లు రాధికాగుప్తా, విజయేందర్‌రెడ్డి, డీఆర్‌ఓ హరిప్రియ, డీఎస్‌ఓ శ్రీనివాస్‌రెడ్డి, సీపీఓ శేఖర్, జిల్లా వ్యవసాయాధికారి చంద్రకళ పాల్గొన్నారు.

## మౌలిక వసతుల కల్పనకు కృషి


శ్రీరామనగర్‌లో పర్యటిస్తున్న లచ్చిరెడ్డి

**ఎల్బీనగర్:** డివిజన్ పరిధిలోని ప్రతి కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తానని బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలోని శ్రీరామనగర్ కాలనీలో సోమవారం ఆయన పర్యటించారు. కాలనీలో రూ.27లక్షలతో చేపట్టిన అభివృద్ధి పనులపై కార్పొరేటర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.కాలనీలో ఇంక కొంత మేర రోడ్డు రోడ్డు నిర్మాణం చేపట్టాలని, కాలనీలో నూతన విద్యుత్ స్తంభాలు, వీధి దీపాలు ఏర్పాటు చేయాలని కోరారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ.. తన దృష్టికి వచ్చిన ప్రతి సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు ఈ కార్యక్రమంలో రవీందర్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి, రవీందర్, ఉపేందర్‌రెడ్డి, నాగమణి పాల్గొన్నారు.

## 27న ఫలహార బండ్ల ఊరేగింపు


బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ఎడ్ల వాసుదేవరెడ్డి

**చంపాపేట:** శ్రావణమాస బోనాలు ప్రశాంత వాతావరణంలో భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని ఎల్బీనగర్ వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు ఎడ్ల వాసుదేవరెడ్డి అన్నారు. ఈ నెల 27న కర్మన్‌ఘాట్ చౌరస్తాలోని నల్ల పోచమ్మ అమ్మవారి శ్రావణ మాస బోనాల సందర్భంగా బజరంగదళ్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసి ఫలహారాల బండి ఊరేగింపు కార్యక్రమాల బ్రోచర్‌ను సోమవారం ఆయన చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈసందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు చేగోని నరేందర్‌గౌడ్ మాట్లాడుతూ.. ఈ నెల 27 సాయంత్రం నాలుగు గంటలకు కర్మన్‌ఘాట్‌లోని కేకే ఎన్‌క్లేవ్ నుంచి క్రాంతినగర్, జ్యోతినగర్ కాలనీల నుంచి క్రాంతిక్లబ్ ఆవరణలోని నల్ల పోచమ్మ అమ్మవారి ఆలయం వరకు పోతరాజుల విన్యాసాలు, శివసత్తులు, భక్తులతో కలిసి ఫలహార బండ్ల ఊరేగింపు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో పవన్, బింటురెడ్డి, కార్తీక్, రమేష్, రఘుగౌడ్ పాల్గొన్నారు.

## 'కాంగ్రెస్ తీరు నచ్చక బీఆర్ఎస్‌లో చేరిక'


కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన ఓరుగంటి వెంకటేశంగౌడ్

**చంపాపేట:** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ పాలకుల ప్రజావ్యతిరేక విధానాలు, ఒంటెద్దు పోకడలు నచ్చక తాను మళ్లీ బీఆర్ఎస్‌లో చేరినట్లు రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి, బీసీ సంఘాల రాష్ట్ర జేఏసీ చైర్మన్ ఒరుగంటి వెంకటేశంగౌడ్ స్పష్టం చేశారు. సోమవారం ఆయన ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ అధ్యక్షుడు కేటీఆర్‌ను కలిసి బీఆర్ఎస్‌లో చేరారు. అనంతరం ఓరుగంటి మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో కేవలం ఒక వర్గానికి చెందిన వారికి, పెట్టుబడులు పెట్టేవారికి మాత్రమే ఉన్నత అవకాశాలు దక్కుతున్నాయని పేద, బలహీన వర్గాలవారికి, రాష్ట్ర సాధనకోసం ఉద్యమం సాగించిన వారికి మాత్రం స్థానం దక్కడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల ముందు సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలు అమలు చేస్తారనే ఉద్దేశంతో తాను కాంగ్రెస్‌లో చేరానని ఆ హామీలన్నీ నీటిమీద రాతల్లా మారాయన్నారు. త్వరలో పెద్ద ఎత్తున బీసీ సంఘాల నేతలతో కలిసి కాంగ్రెస్ హామీలు అమలు చేసే వరకరు ఆందోళనలు చేపడుతామన్నారు.

## గుంతలు ఇలా.. ఇళ్లకు వెళ్లేదెలా?



అధికారులు, ప్రజా ప్రతినిధుల నిర్లక్ష్యంతో అంతర్గత రహదారులు గుంతలమయంగా మారుతున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు మలక్‌పేట్ జోన్ పరిధిలోని చాలా రోడ్లు ధ్వంసమై ప్రమాదకరంగా మారాయి. ఎక్కడ చూసిన వరద కోతకు గురైన గుంతలమయంగా మారాయి. రహదారులపై గుంతలు ఏర్పడటంతో అందులో నీరు చేరి ప్రమాదాలు జరుగుతున్నాయని అధికారులు, ప్రజాప్రతినిధులతో మొర పెట్టుకున్నా, పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఎన్‌టీఆర్‌నగర్ నుంచి అల్కాపురి రేణుకా ఎల్లమ్మ గుడి వద్ద భారీగా గుంతలు ఏర్పడటంతో కనీసం అడుగు పెట్టలేని దుస్థితి ఏర్పడిందని ఉన్నతాధికారులు స్పందించి రహదారులపై ఏర్పడిన గుంతలను పూడ్చాలని కోరుతున్నారు. - దిల్‌సుఖ్‌నగర్

# జోరుగా పలహారం బండ్ల ఊరేగింపు

- ముగిసిన బోనాల జాతర
- ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు


ఓల్డ్ మల్కాజిగిరిలో ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి



హనుమాన్‌పేటలో ఘటంతో..


రంగం (భవిష్యవాణి) వినిపిస్తున్న ఏర్పుల కార్తీక్


గాంధీపార్కు వద్ద చిన్నాయాదవ్ ఆధ్వర్యంలో..


ఆకట్టుకున్న కేరళ వాయిద్యం


ఆకట్టుకున్న కళాకారుల ప్రదర్శన

**మల్కాజిగిరి:** నియోజకవర్గంలో బోనాల జాతర ఘనంగా ముగిసింది. చివరి రోజు పలహారం బండ్ల ఊరేగింపు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. మల్కాజిగిరి ఉజ్జయినీ మహంకాళి అమ్మవారి దేవాలయం వద్ద ఆనవాయితీ ప్రకారం.. యాప్రాల్‌కు చెందిన ఏర్పుల కార్తీక్ పచ్చికుండపై నిలబడి రంగం (భవిష్యవాణి) వినిపించారు. చిన్నాయాదవ్, మాజీ కార్పొరేటర్ జగదీష్‌గౌడ్, ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి, రాధాకృష్ణయాదవ్‌లు పలహారం బండి వద్ద ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి మొక్కుబడిగా కాకుండా భక్తిభావంతో పూజలు చేయాలని ఏర్పుల కార్తీక్ చెప్పారు. వర్షాలు సమృద్ధిగా కురవాలంటే ఆలయంలో జలాభిషేకం చేయాలని సూచించారు.

**అల్వాల్:** మచ్చబొల్లారంలో పలహారబండి ఊరేగింపు వైభవంగా నిర్వహించారు. కార్పొరేటర్ రాజ్‌జితేంద్రనాథ్ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. నాయకులు లక్ష్మీకాంత్‌రెడ్డి, కాలనీ ప్రధాన కార్యదర్శి ప్రదీప్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, శ్రీశైలంయాదవ్, సర్వేష్‌యాదవ్, స్వామి, వీవీ.రావు, దేవేందర్ పాల్గొన్నారు.

### ఘటం ఊరేగింపు..

**గౌతంనగర్:** డివిజన్ హనుమాన్‌పేటలో బోనాల పర్వదినం సందర్భంగా ఘటం ఊరేగింపు జరిగింది. స్థానిక నాయకులు శ్రీనివాసచారి ఇంట్లో అమ్మవారికి ఒడిబియ్యం పోసి ఘనంగా స్వాగతం పలికారు. శ్రీనివాసన్, సాయికుమార్ పాల్గొన్నారు.


పలహారం బండి ఊరేగింపులో కార్పొరేటర్ రాజ్ జితేంద్రనాథ్


దప్పుచప్పుళ్లతో బోనాలు తీసుకెళ్తున్న మహిళలు

## నడి రోడ్డులో ఇలా..



రహదారులు, రోడ్లపై ఉన్న మ్యాన్‌హోళ్లకు మూతలు లేక ప్రమాదకరంగా మారుతున్నాయి. ఆర్‌కేపురం డివిజన్ యాదవనగర్‌లో రోడ్డు మధ్యలో ఉన్న మ్యాన్‌హోల్ మూత ధ్వంసమై ప్రమాదకరంగా మారింది. రోజుల తరబడి అలాగే ఉండటంతో స్థానికులే కర్రలను అడ్డుపెట్టారు. సంబంధిత అధికారులు స్పందిమ్యాన్‌హోల్‌కు మరమ్మతు చేయాలని కోరుతున్నారు.
–దిల్‌సుఖ్‌నగర్

## రోడ్డు భద్రతపై అవగాహన



**చైతన్యపురి:** ట్రాఫిక్ నిబంధనలు పాటించి వాహనాలు నడిపితే ప్రమాదాలను నివారించవచ్చని గ్రేటర్ హైదరాబాద్ ఈడీ రాజశేఖర్ అన్నారు. సోమవారం దిల్‌సుఖ్‌నగర్ సిటీ డిపోలో రోడ్డు భద్రతపై ఆర్టీసీ డ్రైవర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించి సురక్షితమైన డ్రైవింగ్ పద్ధతులను వివరించారు. ప్రమాదాలను తగ్గించటం, సురక్షితమైన డ్రైవింగ్ పట్ల శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎం సుధా పరిమళ డిప్యూటీ ఆర్ఎంలు మాధవి, బాబునాయక్, దిల్‌సుఖ్‌నగర్ డీఎం సమత, ఎంఎఫ్ వెంకటేష్, ఏఎం పావని, పాల్గొన్నారు.